క్లుప్తంగా

పనుల పరిశీలన

కోసూరువారిపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని కోసూరువారిపాలెంలో రూ.7 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఇంజినీరింగ్ అధికారులు మంగళవారం పరిశీలించారు. రాజ్యసభ మాజీ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు మంజూరు చేసిన రూ.5 లక్షలు, పంచాయతీ నిధులు రూ.2 లక్షలు మొత్తం రూ.7 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. సనకా శాంతారావు ఇంటి నుంచి వినాయక గుడి వరకు 120 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులను పంచాయతీరాజ్ శాఖ డీఈ సురేష్, ఏఈ శ్రీనివాసరావు పరిశీలించారు. గ్రామ సచివాలయ ఇంజినీర్ గిరిధర్, కోసూరు శివనాగమల్లేశ్వరావు, సనకా ప్రశాంత్, బోగిరెడ్డి సాంబశివరావు పాల్గొన్నారు.

అంధురాలికి ఆర్థిక సాయం

మచిలీపట్నంటౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక బలరాముని పేటకు చెందిన మొగిలినేని వెంకటేశ్వరికి మచిలీపట్నం ఆది వెలమ సంఘం నాయకులు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. సంఘ అధ్యక్షుడు పిల్లారి శెట్టి శ్రీనివాసరావు రూ.5 వేలు హైదరాబాద్ కు చెందిన సూరతు పాండురంగారావు రూ.11 వేలు మొత్తం రూ.16 వేలను ఆమెకు అందజేశారు. రానున్న రోజుల్లోనూ తమ సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

జైభీమ్ భారత్ పార్టీ మండల అధ్యక్షుడిగా రవి

అవనిగడ్డ: జైభీమ్‌రావ్ భారత్ పార్టీ మండల అధ్యక్షుడిగా బందలాయిచెరువుకు చెందిన గొరుముచ్చు రవిని నియమించినట్లు నియోజకవర్గ కన్వీనర్ సముద్రాల అంబేడ్కర్ తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మండలంలో జైభీమ్‌రావ్ భారత్ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

అనుబంధం మరువలేనిది

కోనేరుసెంటర్: మచిలీపట్నంతో తనకు ఉన్న అనుబంధం, అనుభవం మరువలేనిదని మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి అన్నారు. ప్రత్యేక బదిలీల్లో భాగంగా గుంటూరు మెడికల్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళుతున్న ప్రిన్సిపాల్‌ని అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ సుందరాచారి లాంటివారు దేశంలో అరుదుగా ఉంటారని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంపటి జయకర్ కొనియాడారు. నాయకులు అరిసె శ్రీహరి, ఎం.నీరజ, జె.ప్రసన్న, ఏ.లక్ష్మి అపర్ణ, టీ నాగేంద్రబాబు, వి.లక్ష్మి, కె.భవాని, పి.సునీత, కె. సాయికుమార్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

బొబ్బర్లంక(మోపిదేవి): వరద ముంపు గ్రామాల్లో నూరు శాతం సీసీ రోడ్లు నిర్మించనున్నట్టు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. బొబ్బర్లంకలో పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా రూ.95.70 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 18 సీసీ రోడ్లుకు మంగళవారం శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించారు. సర్పంచ్ దొప్పలపూడి గంగా భవానీ అధ్యక్షతన ఈ కార్యక్రమంలో ఎంపీపీ రావి దుర్గావాణి, దిడ్ల రాణి, డీఈఈ సురేష్‌బాబు, ఏఈఈ బి.శ్రీనివాస రావు, కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు, వేములపల్లి రవిచంద్ర, మురాల సుబ్బారావు, దొప్పలపూడి జగదీష్, ఈవోపీ ఆర్డీ త్రిపుర సుందరి,కార్యదర్శి రామకోటేశ్వరావు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కోడూరు: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ చాణిక్య అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు 'నేను ఏసీబీ ఎస్ఐని.. మీ అబ్బాయి డ్రగ్స్ కేసుల్లో దొరికాడు.. అర్జెంటుగా రూ.30 వేలు నగదును ఫోన్ పే చేయండి' అంటూ కాల్స్ చేస్తున్నారని, వీటిని ప్రజలు నమ్మకుండా వెంటనే కాల్‌ను కట్ చేయాలని ఎస్ఐ సూచించారు. మంగళవారం కోడూరులో ఓ వ్యక్తి ఇదే తరహాలో ఫోన్ కాల్ వచ్చినట్లు చెప్పారు. వ్యాపారులు, రియల్ ఎస్టేట్, ఉద్యోగులకు తరుచుగా ఇలాంటి కాల్స్ వస్తున్నాయని, వీటిని నమ్మకుండా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్ఐ కోరారు. ప్రజలెవరూ ఓటీపీలను బయటకు వ్యక్తులకు చెప్పవద్దని సూచించారు.

కేవీకే సందర్శన

ఘంటసాల: కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు ఆధునిక పరిజ్ఞానంతో కూడిన వ్యవసాయ పద్ధతులను తెలియజేస్తున్నట్లు కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. కోనేరు లక్ష్మణరావు విశ్వవిద్యాలయంలో ఆఖరి సంవత్సరం చదువుతున్న వ్యవసాయ విద్యార్థులు వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా స్థానిక కృషి విజ్ఞాన కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. డాక్టర్ సుధారాణి కృషి విజ్ఞాన కేంద్రం విధుల వివరాలు, వరి, మినుము విత్తన ఉత్పత్తి గురించి వివరించారు. వ్యవసాయ విస్తరణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ కేవీకేలో క్షేత్రస్థాయి పరిశోధనలు తెలియజేశారు. కేవీకే శాస్త్రవేత్తలు రేవతి, మంజువాణి, కృష్ణవేణి, వెంకటలక్ష్మి, యశ్వంత్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దుకాణాలకు 17 దరఖాస్తులు

బంటుమిల్లి: దీపావళికి టపాసుల వ్యాపారం చేసుకునేందుకు 17 దరఖాస్తులు వచ్చినట్లు డీటీ కే పూర్ణచంద్రరావు తెలిపారు. బంటుమిల్లి -13, అర్తమూరు, పెదతుమ్మిడి గ్రామాల్లో రెండేసి వచ్చాయన్నారు. అనుమతుల నిమిత్తం ఆర్డీఓ కార్యాలయానికి పంపామన్నారు.

కానరాని వసతులు.. పర్యాటకుల పాట్లు!

సముద్ర గర్భంలో కలిసి పోయిన బారికేడ్లు.. అలల్లో కొట్టుకుపోయిన విశ్రాంతి బల్లలు.. కానరాని మరుగుదొడ్లు.. గొంతు తడుపుకొనేందుకు కూడా దొరకని తాగునీరు.. ఏటు చూసినా చెత్తాచెదారంతో నిండిన పరిసరాలు.. ఇదీ ప్రస్తుతం హంసలదీవి సాగరతీరం దీన దుస్థితి.

- కళావిహీనంగా హంసలదీవి సాగరతీరం
- కార్తికమాసం సమీపిస్తున్నా కానరాని ఏర్పాట్లు
- కనీస వసతులు లేక పర్యాటకుల ఇబ్బందులు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు


సంగమం వద్ద శిథిలమైన విశ్రాంతి భవనం


సాగర సంగమం వద్ద కనిపించని బారికేడ్లు

కోడూరు: మహాబలేశ్వరంలో జన్మించిన కృష్ణానది వేలాది కిలోమీటర్లు ప్రయాణించి సముద్రంలో కలిసే పవిత్ర హంసలదీవి కృష్ణా సాగర సంగమం ప్రాంతం కళావిహీనంగా మారింది. పర్యాటకులు పట్టుమని పదినిమిషాలు కూడా తీరంలో సేదతీరలేని పరిస్థితి నెలకొంది.

కార్తిక మాసం వస్తున్నా..

మరో రెండు రోజుల్లో కార్తికమాసం ప్రారంభమవుతోంది. ఇప్పటికీ తీరంలో పర్యాటకుల వసతుల కల్పనపై అధికారులు కనీస దృష్టి సారించలేదు. కార్తికమాసాన్ని పురస్కరించుకొని సాగరతీరానికి వేలాది మంది భక్తులు పుణ్యస్నానం చేసేందుకు తరలివస్తారు. ఈ విషయం తెలిసినా అధికార యంత్రాంగం తమకేమి సంబంధం లేదనట్లుగా వ్యవహరించడం పట్ల పర్యాటకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కరకట్ట నుంచే కష్టాలు..

తీరానికి వచ్చే పర్యాటకులకు పాలకాయతిప్ప కరకట్ట వద్ద నుంచే కష్టాలు మొదలవుతాయి. కరకట్ట నుంచి సముద్రం వరకు ఉన్న మూడు కిలోమీటర్ల రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భారీ గుంతలు పడడంతో వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. తీరం పొడవునా పర్యాటకులు సేదతీరేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బల్లలు అలలతో పాటు సముద్రంలోకి కలిసిపోయాయి. దుస్తులు మార్చుకొనేందుకు సౌకర్యం లేదు. ఒక్క మరుగుదొడ్డి కూడా లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాగర సంగమం వద్ద బారికేడ్లు మొత్తం సముద్రంలో కలిసిపోయాయి. ఇక్కడ ఊహకందని లోతు ఉండగా అది తెలియని పర్యాటకులు నీటిలోకి వెళ్లి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. సంగమం వద్ద ఉన్న కృష్ణమ్మ పాదాలు, విగ్రహం సైతం శిథిలావస్థకు చేరింది. విశ్రాంతి భవనం వెనుకభాగంలోని మరుగుదొడ్లకు తలుపులు ఊడిపోవడంతో వినియోగంలో లేవు.

నిమ్మకు నీరెత్తినట్లుగా అధికారులు..

సాగరతీరం అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు శీతకన్ను వేశారని పర్యాటకులు మండిపడుతున్నారు. కార్తికమాసంలో పర్యాటకులు వస్తారని తెలిసి కూడా కనీస వసతుల కల్పనపై దృష్టి పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అలల్లో కలిసిన ఎన్నికల హామీ..

అధికారంలోకి రాగానే హంసలదీవి బీచ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పిన ప్రజాప్రతినిధులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విమర్శలు తావిస్తోంది. రూ.లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని సైతం అటవీ అధికారులు తెరవకుండా ఎప్పుడూ తాళాలు వేసి ఉంచడంతో తీరం అందాలు గోడలకే పరిమితమయ్యాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్తికమాసం నెల రోజుల పాటు తీరంలో ఏర్పాట్లు సమకూర్చాలని పర్యాటకులు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన కృష్ణమ్మ విగ్రహం


బీచ్ వద్ద కనుమరుగైన చిన్నారుల ప్లే గ్రౌండ్

టపాసుల దుకాణాల స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్


టార్చ్, సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో స్థలం వద్దకు వెళ్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ గంగాధరరావు

పెడన: పెడన– గుడివాడ బైపాస్ రోడ్డులోని వై జంక్షన్ సమీపంలోని ఖాళీ స్థలంలో టపాసుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేయనున్న స్థలాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ గంగాధరరావు మంగళవారం రాత్రి పరిశీలించారు. గుడివాడలో టపాసుల దుకాణాలను పరిశీలించి మచిలీపట్నం వస్తూ మార్గ మధ్యలో పెడనలో దుకాణాలను ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలించారు. చిమ్మ చీకటిలో సెల్ ఫోన్ల లైటింగ్‌లో పరిశీలన చేశారు. దుకాణాల వద్ద పరిస్థితిని, స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారుల నుంచి సమాచారం తీసుకున్నారు. షామియానాలు ఏర్పాటు చేయడం, దుకాణాల మధ్య నిబంధనల మేరకు దూరం ఉండేలా చూడాలని ఆదేశించారు. అంతకు ముందు మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి మంగళవారం సాయంత్రం ఇదే స్థలాన్ని పరిశీలించారు. నిబంధనల మేరకు లేకపోవడం, షామియానాలు వేయడంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దుకాణాల వెనుక పెద్ద ఎత్తున గడ్డివాము కూడా ఉండటం ఏమిటంటూ స్థానిక రెవెన్యూ సిబ్బందిపై ఫైర్ అయ్యారు. దీంతో కొందరు తమ్ముళ్లు రంగంలోకి దిగి ఉన్నతాధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తీసుకువచ్చినట్లు సమాచారం.

అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపండి

సీసీఎల్ఏ కమిషనర్ జయలక్ష్మి


వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందించేలా వ్యవస్థను పటిష్టవంతంగా అమలు చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ జయలక్ష్మి అన్నారు. సీసీఎల్ఏ కమిషనర్ మంగళవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార పురోగతి, ఫ్రీ హోల్డ్ ల్యాండ్స్ వెరిఫికేషన్, వాటర్ ట్యాక్స్ కలెక్షన్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా ప్రగతిని వివరించారు. ప్రజల నుంచి అందించిన అర్జీలు గడువులోగా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గడువు దాటినవి ఏమీ లేవని, ముఖ్యంగా రీ ఓపెన్ అర్జీలు తగ్గించేందుకు తహసీల్దార్లు, ఇతర అధికారులతో క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులతో మాట్లాడి సంతృప్తికరంగా సమగ్ర పరిష్కారం చేస్తున్నామన్నారు. పరిష్కారమైన వాటికి ఇస్తున్న ఎండార్స్‌మెంట్లు అప్‌లోడ్ చేయటంతో పాటు అర్జీదారులకు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. వాటర్ ట్యాక్స్ కలెక్షన్‌ను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డీఆర్వో కే చంద్రశేఖరరావు, గ్రీవెన్స్ విభాగం సూపరింటెండెంట్ బేగ్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 2024– 25 విద్యా సంవత్సరానికి సంబంధించి 9, 10వ తరగతి, ఇంటర్ చదువుతున్న బీసీ, ఈ–బీసీ విద్యార్థులు, సంచార జాతుల కులాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ఉపకార వేతనాల కోసం అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆశాఖ జిల్లా అధికారి జి. రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంఎస్ ఎస్‌పీ పథకం కింద ఈ ఉపకార వేతనాలు అందజేస్తారన్నారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.50 లక్షలకు మించరాదన్నారు. ఈ పథకం గురించి పాఠశాల, కళాశాలల యాజమాన్యం విద్యార్థులకు వివరించి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు.

లబ్ధిదారులకు గ్యాస్ ఏజెన్సీలు సహకరించాలి

జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం పొందే లబ్ధిదారులకు ఇబ్బందులు కలిగించకుండా పూర్తి సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఆమె చాంబర్‌లో మంగళవారం సాయంత్రం వివిధ గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 31వ తేదీ నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభిస్తోందన్నారు. ఇందుకోసం ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందే లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీల వద్ద గ్యాస్ కోసం బుక్ చేసుకుని ఆ ధరను గ్యాస్ ఏజెన్సీ వారికి పూర్తిగా చెల్లిస్తారన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వి.పార్వతి, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు పాల్గొన్నారు.

మార్చి 31 వరకు ఉచిత గ్యాస్ బుక్ చేసుకోవచ్చు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రభుత్వం అందించే ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం వర్తించేందుకు లబ్ధిదారులు ఆధార్ నంబరు, రైస్ కార్డుతో పాటు అమలులో ఉన్న గ్యాస్ కనెక్షన్ ఆధార్ నంబరుతో లింకైన బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. జిల్లాలో 5.33 లక్షల మంది రైస్ కార్డుదారులు 6.14 లక్షల మంది గ్యాస్‌కనెక్షన్ వినియోగదారులు ఉన్నారన్నారు. ఈ పథకం అక్టోబరు 31వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, లబ్ధిదారుల అర్హతలను బట్టి డేటా బేస్ ద్వారా పరిశీలించి అనుసంధానం చేసినట్టు చెప్పారు. గ్యాస్ సిలిండర్ కోసం 2025 మార్చి 31వ తేదీ వరకు గ్యాస్ ఏజెన్సీలో బుక్ చేసుకోవచ్చన్నారు. ఈ సమయంలో బుక్ చేసుకున్న లబ్ధిదారులకు మార్చి లోగా ఇచ్చే ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేస్తారన్నారు. 2025 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఒక సిలిండర్ సొమ్ము జమ చేస్తారన్నారు. పథకంలో ఏమైనా అభ్యంతరాలు, సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1967కు కాల్ చేయవచ్చని తెలిపారు.

రీ సర్వేలో తప్పలు సరిచేసుకోవచ్చు

వెంకటాపురం(మోపిదేవి): రీ సర్వే వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తహసీల్దార్ శ్రీవిద్య అన్నారు. మండలంలోని వెంకటాపురంలో గ్రామ సర్పంచ్ తుమ్మా సోములమ్మ అధ్యక్షతన రీ సర్వే ప్రాజెక్టుపై గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం గ్రామసభ నిర్వహించారు. మండల సర్వేయర్ రామకృష్ణబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రీ సర్వే ప్రాజెక్టు ప్రవేశపెట్టడం వల్ల సమస్యల నుంచి పూర్తిగా బయట పడతామని వివరించారు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందనలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం ఆరుగురు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. రొయ్యూరు సుబ్రహ్మణ్యంకు చెందిన 59 సెంట్ల భూమిలో ఎల్‌పీలో 35 సెంట్లు సూచిస్తోందని సరిచేసి పెట్టాలని కోరారు. పరుచూరి జాహ్నవికి చెందిన 25 సెంట్ల భూమిలో ఎల్‌పీలో 24.5 సెంట్లు సూచిస్తోందని తెలిపారు. పరుచూరి బసవనాగేశ్వరరావుకు చెందిన 30 సెంట్లలో ఎల్‌పీలో 29.5 సెంట్లు సూచిస్తోందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇన్‌చార్జి ఆర్ఐ ఎం. శ్రీనివాసరావు, వీఆర్వోలు ప్రసాద్, గ్రామ సర్వేయర్లు రామకృష్ణ, హేమ గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరావు పాల్గొన్నారు.

గూడూరు: రీ సర్వే ప్రక్రియలో తలెత్తిన భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తుందని రీ సర్వే విభాగం డెప్యూటీ తహసీల్దారు కె.జ్ఞానరాజసాయి అన్నారు. ఏపీ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా మండలంలోని ఐదుగుళ్లపల్లి గ్రామంలో నిర్వహించిన రీ సర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారం కోసం మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. మండల సర్వేయరు కె.మురళీకృష్ణ, ఉప సర్పంచి జి.శ్రీనివాస, మురళి, పంచాయతీ కార్యదర్శి వాసవి, వీఆర్వో అడపా నరేష్, గ్రామసర్వేయరు కె.ప్రతాప్ పాల్గొన్నారు. గ్రామసభలో 5 అర్జీలు వచ్చినట్లు డీటీ తెలిపారు.

అరటి తోట నరికివేత

కె.కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె.కొత్తపాలెంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అరటి తోటను నరికేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళవారం అరటి తోటను పరిశీలించారు. రైతు దుట్టా రవీంద్రనాథ్ ఠాగూర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు 20 సెంట్ల స్థలంలో కందలో అంతర పంటగా అరటి వేయగా గెల వదిలే సమయంలో 300 చెట్లను నరికేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పోలీసులకు ఫోన్ చేసి కఠిన చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. గతంలో కూడా గ్రామంలో బ్యానర్లు చించుకోవడం, వరి కుప్పలు తగల పెట్టుకోవడం వంటి సంఘటనలు జరిగినా పోలీసులు ఉదాసీన వైఖరి అవలంభించారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు, మండలి వెంకట్రామ్, మత్తి నాగమల్లేశ్వరావు, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, దుట్టా మోహన శివరాజయ్య, పూషడపు రత్నగోపాల్ పాల్గొన్నారు.

బండ్లు వెళ్లకుండా రోడ్డుకు గండి


కృష్ణానదికి వెళ్లకుండా రోడ్డుకు గండికొట్టిన దృశ్యం

పాపవినాశనం(ఘంటసాల): ఉచిత ఇసుక పథకం పలువురికి తంటాలు తెచ్చిపెడుతోంది. మండలంలోని పాపవినాశనం గ్రామం కృష్ణానదిలో గ్రామానికి చెందిన పలువురు ఎద్దులబండ్లతో ఇసుక తెచ్చి అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. అయితే కృష్ణా నదిలో లంక భూములు ఉండటంతో సొసైటీ ప్రతినిధులు ఇష్టాను సారంగా ఇసుక తరలిస్తున్నారనే నెపంతో ఎద్దుల బండ్లు నదిలోకి వెళ్లకుండా కృష్ణా పుష్కరాలకు ప్రభుత్వం వేయించిన రోడ్డుకు భారీ గండి కొట్టించారు. దీనిపై ఎద్దుల బండ్ల యజమానులు ప్రశ్నించగా లంక భూములు మావి, మీకు చేతనైంది చేసుకోండని ప్రశ్నించిన వారిని భయాందోళనకు గురి చేస్తున్నారని ఎద్దులబండ్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. జీవాలు మేత కోసం వెళ్లాలన్నా ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. పాపవినాశనం పరిధిలోని పాపాయిలంక, బాపట్ల జిల్లా రావిలంకల్లో గ్రామానికి చెందిన జీవాలు మేపుకునే వారు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు వెచ్చించి పచ్చమేత పాటలు పాడుకుంటామని, అక్కడకు వెళ్లి రావడానికి ఉండే ప్రధాన రహదారిపై భారీ గండి కొట్టడం వల్ల వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం పశువులు, జీవాలు నీరు తాగడానికి కూడా దారి లేని పరిస్థితి ఏర్పడదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గండిపూడ్చించి దారి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సంక్షిప్తంగా...

● పట్టభద్రుల ఓటర్లుగా నమోదుకు 1,720 దరఖాస్తులు

పెడన: కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి పెడన అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 1,720 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు కె.అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం దరఖాస్తులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను పరిశీలించి గుంటూరులోని సంబంధిత కార్యాలయానికి పంపామన్నారు. పెడన మండలం నుంచి 638 దరఖాస్తులు రాగా వీటిల్లో 626 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా, 12 ఆఫ్‌లైన్ ద్వారా వచ్చాయన్నారు. గూడూరు మండలంలో 364 దరఖాస్తుల్లో 341 ఆన్‌లైన్, 23 ఆఫ్‌లైన్‌లో, బంటుమిల్లిలో 443కు 364 ఆన్‌లైన్, 79 ఆఫ్‌లైన్, కృత్తివెన్ను మండలంలో 275కు 264 ఆన్‌లైన్‌లోను, 11 ఆఫ్‌లైన్‌లోను వచ్చాయన్నారు. డీటీ నరసింహారావు ఉన్నారు.

● కాలువల్లో సిల్టు తొలగింపు

పెడన: పట్టణంలోని 18వ వార్డు గాంధీనగర్ సచివాలయ పరిధిలో డ్రైయినేజీలో సిల్టు తీత పనులను మంగళవారం సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ గోపాలరావుతో కలిసి పరిశీలించారు. కౌన్సిలర్ కోమట్ల సుమప్రియ మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. చైర్‌పర్సన్ సూచనల మేరకు పూడిక తీత పనులు కేటాయించామని కమిషనర్ పేర్కొన్నారు. వీరితో పాటు వైఎస్సార్ సీపీ నాయకుడు అనిల్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వార్డు మేస్త్రి న్నారు.

● తీరప్రాంతంలో సెంట్రల్ టీం పర్యటన

కోడూరు: సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ అధికారులు మంగళవారం సముద్ర తీరప్రాంతంలో పర్యటించారు. పాలకాయతిప్ప, ఇరాలి, ఊటగుండంలో ఉన్న అవుట్‌పాల్ స్లూయిజ్‌లను పరిశీలించారు. రత్నకోడు డ్రెయిన్‌పై పాలకాయతిప్ప వద్ద అవుట్‌ఫాల్ స్లూయిస్, నాగాయలంక మండలం సంగమేశ్వరం వద్ద ఉన్న మరో స్లూయిస్‌ను అధికారులు చూశారు. కట్టడాల పటిష్టత, షట్టర్ల పనితీరుపై ఆరా తీశారు. నూతన స్లూయిస్‌ల నిర్మాణాల అవశ్యకతపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఈఈ విజయసారథి, ఏఈలు వెంకటేశ్వరరెడ్డి, మల్లేశ్వరి, డ్రెయినేజీ శాఖ అధికారులు అబ్దుల్ కరీం, పి.చిరంజీవి, ఇరిగేషన్ ఏఈ రవితేజ పాల్గొన్నారు.

● సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గూడూరు: వరిసాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా వరిసాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎంఏవో కె.ఆంజనేయ కుమార్ తెలిపారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మల్లవోలు-1, ఐదుగుళ్లపల్లి గ్రామాల్లో పర్యటించిన వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. ఏఓ మాట్లాడుతూ రైతులంతా కలిసి సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టాలన్నారు. వీఏఏలు రాజ్యలక్ష్మి, నాగేశ్వరరావు, రైతులు ప్రత్తిపాటి శ్రీనివాసరావు, చీడేపూడి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

● వ్యాసరచన పోటీలు

కృత్తివెన్ను: హస్తకళలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సంగమూడి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు హస్తకళలపై మక్కువ కలిగించేలా శిక్షణ ఇవ్వడంతో పాటు, మరింత ప్రావీణ్యం పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈవో-2 ప్రసాదరావు వివరించారు. విజేతలకు బుధవారం బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు.

● పెడన నియోజకవర్గంలో 1,67,239 మంది ఓటర్లు

పెడన: సార్వత్రిక ఎన్నికల అనంతరం ఎన్నికల సంఘం పెడన అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేసిందని పెడన ఇన్‌చార్జి తహసీల్దారు అనిల్‌కుమార్ తెలిపారు. ఓటర్ల జాబితా మార్పులు చేర్పులు అనంతరం 2024 అక్టోబరు 5వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తుల ద్వారా పెడన అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 1,67,239 మంది ఓటర్లు ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు 1,67,564 ఓటర్లు ఉన్నారని, డెత్‌ల తొలగింపు, కొత్త దరఖాస్తుల పరిశీలన అనంతరం ప్రస్తుతం 1,67,239 మంది ఉన్నారన్నారు. ఇందులో 84,422 మంది మహిళలు, 82,817 మంది పురుషులున్నారి పేర్కొన్నారు.

● రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

తలగడదీవి(నాగాయలంక): 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 28న గుడివాడ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కృష్ణా జిల్లా జూనియర్ ఖోఖో క్రీడాకారుల జట్టులో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా విద్యార్థిని ఇమ్మడి కావ్యశ్రీ ఎంపికైనట్లు పాఠశాల హెచ్.ఎం బండ్రెడ్డి శివరామ ప్రసాద్ మంగళవారం తెలిపారు. పల్నాడు జిల్లా కారెంపూడిలో నవంబరు7, 8, 9 తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడాకారుల పోటీలకు కావ్యశ్రీ హాజరవుతుందన్నారు.

● విద్యార్థులకు పోటీలు

కోడూరు: విద్యార్థుల్లో ఉన్న మేధాశక్తిని వెలికి తీసేందుకు మంగళవారం వివిధ అంశాల్లో సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంఈఓలు టి.వి.ఎం.రామదాసు, శ్రీనివాసరావుల పర్యవేక్షణలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. 1, 2 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో వృత్తలేఖనం, స్పష్టమైన పఠనం, 3, 4, 5 తరగతుల విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్, 6 నుంచి 10 తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీల్లో 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తహసీల్దార్ బి.శ్రీనునాయక్ విద్యార్థులను అభినందించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓలు తెలిపారు.

● దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన

గూడూరు: మండలంలో మందుగుండు సామగ్రి దుకాణాల ఏర్పాటుకు అనువైన స్థలాలను తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో మందుగుండు సామగ్రి దుకాణాల ఏర్పాటుకు 8 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జనావాసాలకు దూరంగా దుకాణాల ఏర్పాటుకు అనువైన స్థలాలను ఎంపిక చేసినట్లు ఆమె వెల్లడించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దుకాణ యజమానులు నడుచుకోవాలని ఆమె స్పష్టం చేశారు.

● నాణ్యమైన విద్య అందించాలి

గోగినేనిపాలెం(ఘంటసాల): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించి బలోపేతం చేయాలని డీపీఆర్‌టీయూ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను అన్నారు. మండలంలోని గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో ప్రభుత్వ పాఠశాలల విజయభేరి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. డాక్టర్ శ్రీను మాట్లాడుతూ గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో గత సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో 92.4 శాతం ఉత్తీర్ణత సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. డీపీఆర్‌టీయూ కృష్ణాజిల్లా అధ్యక్షులు గరికపాటి పెరుమాళ్లు మాట్లాడారు. అనంతరం పది ఫలితాల్లో ప్రతిభ కనబర్చేందుకు కృషి చేసిన హైస్కూల్ హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు ఎస్.సుధాకరరావు, ఎస్.బసవేశ్వరరావు, ఎం.పిచ్చేశ్వరరావు, డీఎల్‌పీ బిజిలిరాణి, పి.నాగమణి, జి.మారుతీ, ఆర్.సుబ్బారావు, పి.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావులను దుశ్శాలువాతో సత్కరించి గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలను అందించారు. సంఘ నాయకులు జె.నరసింహారావు, సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● యూబీ ఉద్యోగుల బైక్ ర్యాలీ

మచిలీపట్నంటౌన్: యూనియన్ బ్యాంక్ మచిలీపట్నం ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు రీజనల్ అధికారి కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాంతీయ కార్యాలయం నుంచి కోనేరు సెంటర్ మీదుగా ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య ఇంటి వరకు ఈ ర్యాలీ చేరింది. అనంతరం బ్రాంచ్ ఆవరణలో మొక్కలు నాటారు. కోనేరు సెంటర్లో ఉద్యోగులు మానవహారం నిర్వహించారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం నాయకులు దుర్గారావు, సలాం రాజేష్, బాలకోటి, సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

● వేరేచోట ఇళ్ల స్థలాలు ఇస్తే ఎడ్లంకను వదిలేస్తాం

అవనిగడ్డ: వరదలు వచ్చినపుడల్లా తీవ్రంగా నష్టపోతున్నామని వేరేచోట స్థలాలు చూపించి గృహాలు మంజూరు చేస్తే తామంతా ఎడ్లంకను వదిలేస్తామని కొంత మంది గ్రామస్తులు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు విన్నవించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద బుద్ధప్రసాద్‌కు ఎడ్లంక వాసులు తమ సమస్యలు విన్నవించారు. వరదల సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉండాల్సి వస్తోందని, వరదలు తగ్గిన తరువాత గ్రామంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని, గ్రామం కోతకు గురై ఇళ్లు నదిలో పడిపోతున్నాయని చెప్పారు. కరకట్టకు అవతల స్థలాలు చూపించి గృహాలు మంజూరు చేయిస్తే తామంతా గ్రామం వదిలి వచ్చేస్తామని చెప్పారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, జిల్లా కలెక్టర్ బాలాజీ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సర్పంచ్ పాలెపు సామ్రాజ్యం, వెంకటేశ్వరరావు, కొల్లూరి వాసుతో పాటు స్థానికులు పాల్గొన్నారు.